క్లుప్తంగా

థెరిస్సా విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న థెరిస్సా ప్రిన్సిపాల్ మెర్సీ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : రాజమహేంద్రవరంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అథ్లెటిక్ మీట్లో స్థానిక సెయింట్ థెరిస్సా స్వయం ప్రతిపత్తి మహిళా కళాశాల విద్యార్థినులు పలు విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారని ప్రిన్సిపాల్ మెర్సీ తెలిపారు. తమ విద్యార్థినులు మూడు విభాగాల్లో బంగారు, తొమ్మిది విభాగాల్లో వెండి, నాలుగు విభాగాల్లో కాంస్య పతకాలు సాధించారని పేర్కొన్నారు. సోమవారం స్థానిక కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినులను పతకాలు సాధించేలా తీర్చిదిద్దిన వైస్ ప్రిన్సిపాల్ మరియా క్రిష్టియ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సుశీల, వ్యాయామాధ్యాపకులు, విభాగాధిపతి పీఎం సెలియన్ రోజ్, అధ్యాపకురాలు కె.శ్యామలను, విజేతలుగా నిలిచిన క్రీడాకారులను అభినందించామని వివరించారు.

ఘనంగా సెమీ క్రిస్మస్



సెమీ క్రిస్మస్ వేడుకలో పాల్గొన్న యువకులు

ఏలూరు రూరల్ : ఏసుప్రభు పుట్టకతో ప్రపంచానికి ప్రేమ, శాంతి, సౌభ్రాతత్వంతో ప్రసరించాయని పాస్టర్ డీసీ ఏసుపాదం అన్నారు. ఆదివారం రాత్రి తంగెళ్లమూడి పెదమాలపల్లి సీఎస్‌ఐ చర్చి వద్ద సెమీ క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించారు. పాస్టర్ ప్రసాదు సూచనలతో సంఘ జనులు ప్రార్థనలు చేశారు. క్యాండిల్స్ వెలిగించి సెమీ క్రిస్టిమస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పెదమాలపల్లి యూత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు బండి తంబి, పి.ప్రవీణ్, కారే తరుణ్, బేతాల వరుణ్‌రాజ్, జక్కుల నవీన్, జక్కుల విజయ్, బేతాల చంటి తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు వినతి

గణపవరం: గణపవరం సెంటర్‌లో రెండు దశాబ్దాలుగా మూత పడి, నిరుపయోగంగా ఉన్న మాతా శిశు సంరక్షణ కేంద్రంలో కిడ్నీ డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని అఖిలభారత హ్యాండ్‌లూమ్స్ మాజీ డైరెక్టర్ నంద్యాల రామలింగరాజు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమస్యల పరిష్కార వేదికలో విజ్ఞప్తి చేశారు. కొల్లేరు ప్రాంత ప్రజలకు ఉపయోగపడేలా డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు.

పన్నుల వసూలులో వెనుకబాటు

- పన్నుల డిమాండ్ రూ.66.50 కోట్లు
- వసూలైంది రూ.22.37 కోట్లే
- ఇదీ ఏలూరు కార్పొరేషన్ పరిస్థితి

ఏలూరు (టూటౌన్): పన్నుల వసూళ్లల్లో ఏలూరు కార్పొరేషన్ వెనుకబడింది. మూడో క్వార్టర్ సమయం త్వరలో ముగియనుంది. అయినా ఇంకా మొత్తం డిమాండ్‌లో కేవలం మూడో వంతు మాత్రమే వసూలైంది. పన్నుల వసూళ్ల కోసం ఎన్ని ప్రత్యేక చర్యలు తీసుకున్నా చెల్లించేందుకు ప్రజలు ముందుకు రాకపోవడం వల్లే ఈ పరిస్థితి ఉందని అధికారులు చెబుతున్నారు. మరో వైపు పన్నుల వసూళ్లకు సంబంధించి వార్డు సచివాలయ సిబ్బందిపై వదిలేసి, అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని రాజకీయ ప్రతినిధులు ఆరోపిస్తుండడం విశేషం. ఇటీవల మున్సిపాల్టీల ఆర్జేడీ నాగ నరసింహారావు ఏలూరులో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సైతం పన్నుల వసూళ్లలో వెనుకబడి ఉండటం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

పన్నులు వసూలైతేనే అభివృద్ధి

ఏలూరు కార్పొరేషన్ పరిధిలో మొత్తం జనాభా 3.70 లక్షల మంది వరకు ఉన్నారు. మొత్తం 50 డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 79 వార్డు సచివాలయాలు ఉన్నాయి. వివిధ సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి జరగాలంటే కార్పొరేషన్‌లో ఆర్థిక పరిపుష్టి చాలా అవసరం. నగర పాలక సంస్థలో వివిధ రకాల పన్నులు వసూలు చేసేందుకు రెవెన్యూ విభాగం ఎంతో కీలకం. ఈ విభాగం వార్డు సచివాలయ సిబ్బందిపై అజమాయిషీ చేస్తూ చేతులు దులిపేసుకుంటున్నారు. దీంతో పన్నుల వసూళ్లలో వెనుకబడినట్టు పలువురు చెబుతున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే తొమ్మిదో నెల గడుస్తుంది. అయినా ఇప్పటి వరకు ఆస్తి పన్నులో 41 శాతం, ఇతర పన్నుల్లో కేవలం 15 శాతం లోపే వసూలైనట్టు తెలిసింది.



ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం

స్పందన కరువు

పన్నుల వసూళ్లకు కార్పొరేషన్ పరిధిలో 8 టీంలు, ప్రచార వాహనాలు ఏర్పాటు చేశారు. పాత బకాయిలు వన్‌టైమ్ సెటిల్మెంట్ చేసుకోవడం ద్వారా పరిష్కరించుకోవచ్చునని చెబుతున్నారు. వన్‌టైమ్ సెటిల్‌మ్మెంట్‌లో రాయితీ ఇస్తున్నారు. ఆర్థిక సంవత్సరం ప్రారంభమై ఏప్రిల్ నెలలో చెల్లిస్తే 5 శాతం మేరకు పన్ను రాయితీ ఇస్తున్నారు. అయినా పన్ను చెల్లింపు దారుల నుంచి స్పందన అంతంత మాత్రంగానే కన్పిస్తుంది.

వసూళ్లు ఇలా..

ఏలూరు కార్పొరేషన్ పరిధిలో ఆస్తి పన్ను డిమాండ్ మొత్తం రూ.48 కోట్లు. ఇప్పటి వరకు రూ.20 కోట్లు మాత్రమే వసూలైంది. ఇది మొత్తం బకాయిలో 41 శాతంగా ఉంది. నీటి పన్ను డిమాండ్ రూ.16 కోట్లు కాగా, రూ.2 కోట్లు మాత్రమే అంటే 13 శాతం వసూలైంది. ఖాళీ స్థలాల పన్ను డిమాండ్ రూ.2.48 కోట్లు కాగా, రూ.37 లక్షలు మాత్రమే వసూలైంది. ఇతర పన్నులు స్టాంప్ డ్యూటీ రిజిస్ట్రేషన్లు, ప్రకటనల ద్వారా దాదాపు రూ.7.50 కోట్లు ఉండగా, కేవలం రూ.కోటిలోపే వసూలైంది.

వసూళ్లలో రాజీ లేదు



కార్పొరేషన్ పరిధిలో గత 10 రోజుల నుంచి పన్నుల వసూళ్లు ఊపందుకున్నాయి. సెలవు రోజులు మినహా మిగతా రోజుల్లో రోజుకు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల మధ్య వసూలవుతున్నాయి. పన్నుల వసూళ్లలో రాజీ పడే ప్రసక్తే లేదు. సిబ్బందిని క్షేత్రస్థాయికి పంపుతున్నాం. టీమ్‌ల వారీగా విభజించి ప్రతిరోజు పర్యవేక్షణ చేస్తున్నాం. నూటికి నూరు శాతం సాధించే లక్ష్యంతో పనిచేస్తున్నాం.

– ఎ.భానుప్రతాప్, కమిషనర్, ఏలూరు నగరపాలక సంస్థ

28న అక్కినేనికి స్వరాంజలి



స్వరాంజలి ఆహ్వాన పత్రికను విడుదల చేసిన నాయకులు

ఏలూరు (టూటౌన్): ప్రముఖ దివంగత చలన చిత్ర నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతిని పురస్కరించుకొని ఈనెల 28న స్వరాంజలి నిర్వహిస్తున్నామని అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో ఆహ్వానపత్రిక విడుదల చేశారు. ఘంటసాల స్వరపీఠం వ్యవస్థాపక కార్యదర్శి ఎస్ఎం సుభాని మాట్లాడుతూ సర్ సీఆర్ రెడ్డి కాలేజీ ఆడిటోరియంలో శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు స్వరాంజలి ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో దేవినేని భాస్కరరావు, చైల్డ్ రైట్స్ కమిషన్ మెంబర్ జె.రాజేంద్ర, మేతర అజయ్ బాబు, దేవరకొండ వెంకటేశ్వర్లు, పోలవరపు దేవ రత్నాకర్, కొమ్మోజు శ్రీనివాసరావు, ఈటీ అర్జున్‌రావు, కూతాడి రమేష్, సేనపతి అచ్యుత్, సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

నానిది విలువలకు తిలోదకాలిచ్చే వ్యక్తిత్వం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మాజీ ఎమ్మెల్యే ఆళ్ల నాని టీడీపీలో చేరికను టీడీపీ శ్రేణులు బలంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ నెల మొదటి వారంలోనే నాని టీడీపీలోకి వెళ్లడానికి ముహూర్తం ఖరారై వాయిదా పడిన సంగతి తెలిసిందే. తాజాగా నాని టీడీపీలో చేరిక ఖాయమంటూ వార్తలు వచ్చిన నేపథ్యంలో టీడీపీ నాయకులు సోమవారం ఏలూరులో సమావేశమై తమ వ్యతిరేకతను వ్యక్తం చేశారు. రాజకీయ భిక్ష పెట్టిన కాంగ్రెస్ పార్టీకే వెన్నుపోటు పొడిచిన వ్యక్తిత్వం, నీచ రాజకీయ దగాకోరు అయిన ఆళ్ల నాని, తన రాజకీయ ఎదుగుదలకు ఊపిరిపోసిన ఏలూరు గడ్డ పరువును దేశస్థాయిలో దిగజార్చిన ప్రజా వ్యతిరేకి అని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్‌ని కాదని వైఎస్సార్ సీపీలోకి వెళ్లడంతో కాంగ్రెస్ వాదులు నానిని విడిచిపెట్టారని వివరించారు. ఆయన ప్రదర్శించిన అధికార దర్పానికి 2024 తర్వాత వైఎస్సార్ సీపీకి క్యాడర్ దూరమైందని, నాని రాజకీయ ఎదుగుదలకు అత్యంత కీలకంగా నిలిచిన రాజశేఖరరెడ్డి కుటుంబానికి కనీసం కష్టకాలంలో అండగా ఉండలేకపోయారని ఎద్దేవా చేశారు. నాని వల్ల టీడీపీకి వీసమెత్తైనా ప్రయోజనం ఉండదని టీడీపీ అధినేతకు కూడా తెలుసునని వివరించారు. ప్రస్తుతం నాని అక్రమాస్తులను కాపాడుకొనేందుకే టీడీపీలో చేరుతున్నారని చర్చించుకున్నారు.

ముమ్మరంగా దాళ్వా పనులు

దెందులూరు: దాళ్వా వరి సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నారుమడులు పోయడం, దుక్కులు దున్నటం, పొలం గట్లు బాగుజేత పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. దెందులూరు మండలంలో దాదాపు 15 వేల ఎకరాల్లో దాళ్వా సాగు చేస్తున్నారు. వ్యవసాయ శాఖ సూచించిన విత్తనాలు సాగు చేస్తే దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని ఏఓ దామా వెంకటేశ్వర్లు రైతులకు సూచించారు.





కలెక్టరేట్ గాంధీ విగ్రహం వద్ద పడిగాపులు కాస్తున్న ఫిర్యాదుదారులు



పోలీసుకు తన సమస్య చెప్పకుంటున్న మహిళ



తాళం వేసి ఉన్న మీకోసం జరిగే గోదావరి మీటింగ్ హాల్

అర్జీదారుల అసంతృప్తి

ఏలూరు కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే సమస్యల పరిష్కార వేదికలో జిల్లా అధికారులకు తమ గోడు చెప్పుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి వ్యయ ప్రయాసలకోర్చి ప్రజలు వస్తుంటారు. తీరా వస్తే ఈ రోజు పీజీఆర్ఎస్ కార్యక్రమం రద్దయిందని తెలిసి నిరాశతో తిరుగు ప్రయాణమయ్యారు. సోమవారం పోలవరంలో సీఎం చంద్రబాబు పర్యటన ఉండటంతో పీజీఆర్ఎస్‌ను రద్దుచేశారు. విషయం తెలియక కలక్టరేట్‌కు వచ్చిన అర్జీదారులు నిరాశతో వెనుదిరిగారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు



కలెక్టరేట్‌కు వస్తున్న ఫిర్యాదుదారులు



అధికారుల కోసం అర్జీదారుల ఎదురుచూపు

వన్‌స్టాప్ సెంటర్‌లో సేవలపై ఆరా



వన్‌స్టాప్ సెంటర్‌లో బూసి వినీత

ఏలూరు (టూటౌన్): ఏలూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని వన్‌స్టాప్ సెంటర్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు బూసి వినీత సోమవారం సందర్శించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన్ స్టాప్ సెంటర్‌ను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వన్ స్టాప్ సెంటర్‌లో ఎక్కువగా నమోదయ్యే కేసులేవి, బాధిత మహిళలకు ఏ విధమైన సేవలు అందిస్తున్నారని ఆరా తీశారు. ఈ సెంటర్లో తాత్కాలిక వసతి పొందుతున్న మహిళ వివరాలు అడిగి తెలుసుకొన్నారు. వన్ స్టాప్ సెంటర్ రిజిస్టర్లను, కేసు ఫైల్స్‌ను పరిశీలించారు. బాధిత మహిళలు, బాలికలకు మెరుగైన సేవలు అందించాలని తెలియజేశారు. ఈ సందర్శన భాగంలో వన్ స్టాప్ సెంటర్, సెంటర్ అడ్మినిస్ట్రేటర్ సీహెచ్ నిర్మల, వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా చట్టాల అమలు తీరు దారుణం



మాట్లాడుతున్న వన్‌స్టాప్ అడ్మిన్ నిర్మల

ఏలూరు (టూటౌన్): మహిళా చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ ఈఏ నిర్మల అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో స్థానిక ఇండోర్ స్టేడియం ఎదురుగా ఉన్న లేడీస్ క్లబ్‌లో మహిళా రక్షణ చట్టాలపై కార్యక్రమం శిక్షణ శిబిరం జిల్లా కోఆర్డినేటర్ సింగవరపు జ్యోతి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. అతిథి నిర్మల్ మాట్లాడుతూ మహిళలు అన్ని చోట్లా శారీరక, మానసిక, లైంగిక వేధింపులకు గురవుతున్నారని తెలిపారు. గృహ హింస చట్టం–2005లో అమలులోకి వచ్చిందని, రక్షణ చట్టాల అమలు తీరు బాగోకపోవడంతో మహిళల పరిస్థితి దారుణంగా ఉందని వివరించారు. డీబీఆర్‌సీ ట్రైనింగ్ కోఆర్డినేటర్ ఎం హేమలత మాట్లాడుతూ బాల్య వివాహాల నిషేధ చట్టం–2006, లైంగిక నేరాల నుంచి పిల్లలకు రక్షణ చట్టం–2012లపై మాట్లాడారు. న్యాయవాది బి.కృష్ణవేణి మాట్లాడుతూ స్త్రీ సమాన హక్కుల కోసం ఐక్యతతో పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ శిబిరంలో 40 మందికిపైగా మహిళలు, డీబీఆర్‌సీ రీజినల్ కోఆర్డినేటర్ రమాదేవి, వైస్ డైరెక్టర్ ఎన్ లక్ష్మి, డీబీఆర్‌సీ సిబ్బంది గోసాల రూన్సీ, బలే సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పంచాయతీ సిబ్బందికి శిక్షణ

నిడమర్రు: సచివాలయ సిబ్బందికి మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అనే అంశంపై రెండు రోజుల శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంపీడీఓ జి.విజయకుమారి తెలిపారు. ఈ శిక్షణకు అడవికొలను, ఎనికేపల్లి, గుణపర్రు, క్రొవ్విడి, మందలపర్రు, పెదనిండ్రకొలను, సిద్దాపురం, తోకలపల్లి సచివాలయాల సిబ్బందితో పాటు గ్రామ సర్పంచ్‌లు హాజరవ్వాలని కోరారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	38
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	43
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	17
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.45	4820	25
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.15	4822	27
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	19
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	32
ఏలూరు–జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	26
ఏలూరు–బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	34
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	18
ఏలూరు – తిరుపతి	16.00	4830	33

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	28	చిక్కుడు కాయలు	40
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	10, 15
బెండకాయలు	36	కంద	60
పచ్చిమిర్చి	24–30	బీట్‌రూట్	50
కాకర కాయలు	34–40	కీరా దోస	44
బీరకాయలు	34	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	48	అల్లం	70
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	50	పాలకూర	10
దొండకాయలు	38	చుక్కకూర	10
బంగాళదుంపలు	38	తోటకూర	10
ఉల్లిపాయలు	55	గోంగూర	07
గోరుచిక్కుడు	28	పుదీనా	05
దోసకాయలు	28–32	బఠాణి	--
ఆనబకాయ (1)	20–25	క్యాప్సికమ్	72
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	36

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కంప్యూటర్ డెస్క్‌ల వితరణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక ప్రముఖ వైద్యుడు, ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సీపీడీసీ సభ్యుడు డి.సుబ్బారావు, సరస్వతి దంపతుల కుమారుడు సూర్య సాకేత్ ఫేస్‌బుక్‌లో ఉద్యోగంలో చేరిన సందర్భంగా స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం 15 కంప్యూటర్ డెస్క్‌లు అందజేశారు. కళాశాలలో ప్రిన్సిపాల్ జి.గిరిబాబు అధ్యక్షతన దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని సుబ్బారావు దంపతులు, ప్రిన్సిపాల్ పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలతో నివాళుర్పించారు. కార్యక్రమంలో హేలాపూరి చాలెంజర్స్ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఎస్ పోలేశ్వరరావు, సెక్రటరీ కె.రాంప్రసీన్, కళాశాల సీపీడీసీ సభ్యుడు ఎల్ వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



డెస్క్‌లు అందించిన సుబ్బారావు కుటుంబ సభ్యులు

సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలి

ఉంగుటూరు: నారాయణపురం బస్టాండు సెంటర్లో సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటుచేయాలని ప్రజలు కోరు తున్నారు. కొల్లేరుకు ముఖద్వారంగా ఉన్న నారాయణపురం నుంచి వందలాది మంది కొల్లేరు గ్రామల ప్రజలు ఇక్కడకు చేరుకుని సుదూర ప్రాంతాలకు వెళ్లి, వస్తుంటారు. నారాయణపురం బస్టాండ్‌లో మరుగుదొడ్లు లేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై కలెక్టర్‌లో ఫిర్యాదు చేసినట్టు గ్రామ పంచాయతీ మాజీ మెంబరు మెండ్యాల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

ధనుర్మాసోత్సవాలు ప్రారంభం



తిరుప్పావై పారాయణ చేస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని వివిధ ఆలయాల్లో ధనుర్మాసోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అగ్రహారంలోని భూ, నీళా సమేత శ్రీ జనార్థన స్వామి దేవస్థానంలో ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించారు. అనంతరం విష్ణు సహస్రనామ పారాయణ చేసి స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. ఈ సందర్భంగా తిరుప్పావై సేవా కాలం నిర్వహించి ప్రథమ పాసుర విన్నపం చేశారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు వంగల పవన్ కుమార్ విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి సీహెచ్‌వీ నాగ మునేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- పవర్‌పేటలోని శ్రీదేవి, భూదేవి సమేత వాసుదేవ స్వామి దేవస్థానంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలభోగ వినియోగం, శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ చేసి విశేష హారతులు సమర్పించారు. రాత్రి స్వామి వారికి విశేష హారతులు పట్టి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. అనంతరం ఏకాంత సేవ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు కందుకూరి వేంకట విజయ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి ఎం రామాంజనేయులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

రిజర్వేషన్ల రద్దుకు కుట్ర

భీమడోలు: ఎస్సీ వర్గీకరణతో క్రిమిలేయర్ విధానంగా ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ అన్నారు. ఈ మేరకు భీమడోలులో సోమవారం రాత్రి ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. వర్గీకరణ పేరుతో రిజర్వేషన్ల తొలగింపునకు సీఎం చంద్రబాబు, పీఎం మోదీ ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు. క్రిమిలేయర్ విధానాన్ని అన్ని కులాలకు అమలు చేయకుండా ఒక్క మాల జాతికే వర్తింపు చేయడం కుట్రపూరితమేనని తెలిపారు.

మొక్కలకు ట్రీ గార్డులు

దెందులూరు: స్థానిక గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలలో నాటిన మొక్కలకు ట్రీ గార్డులు ఏర్పాటు చేశామని ఇన్‌చార్జి హెచ్ఎం మల్లికార్జున రావు సోమవారం తెలిపారు. మొక్కల సంరక్షణ బాధ్యత కూడా ఆసక్తి ఉన్న విద్యార్థులకు అప్పగించామని చెప్పారు.